మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 192 | ఆదివారం | 11 - 01 - 2026 | పేజీలు: 8 | వెల: 4

## నెలలో ఒకరోజైనా గ్రామాల్లో సేవలందించాలి



2లో..



### రష్యా, చైనా కంటే ముందే గ్రీన్‌ల్యాండ్‌ను
## స్వాధీనం చేసుకుంటాం

మన గళం డెస్క్ : గ్రీన్‌ల్యాండ్‌ను ఏదో ఒక విధంగా తమ ఆధీనంలోకి తీసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే సైనిక బలాన్ని కూడా ఉపయోగించడానికి వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. ఆర్కిటిక్ ప్రాంతంలోని గ్రీన్‌ల్యాండ్‌పై డెన్మార్క్‌కు గుత్తాధిపత్యం ఉందన్న వాదనలను ట్రంప్ పూర్తిగా కొట్టిపారేశారు. గ్రీన్‌ల్యాండ్ విషయంలో ముందుగా ఒప్పందం ద్వారా పరిష్కారం సాధించాలని తమ అభిమతమని, అది సాధ్యం కాకపోతే కఠినమైన మార్గాన్ని ఎంచుకుంటామని ఆయన హెచ్చరించారు. వైట్ హౌస్‌లో చమురు కంపెనీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఈ అంశంపై 2 లో..

### ఇరాన్‌లో అట్టుడుకుతున్న
## నిరసనలు



**- దాదాపు 200 మంది మృతి అనుమానం**

మన గళం, టెహ్రాన్ : ఇరాన్ దేశం అగ్నిగుండంలా మారింది. సుప్రీం నేత ఖమేనీకి వ్యతిరేకంగా చెలరేగిన భారీ నిరసనలతో దేశవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాజకీయ, ఆర్థిక మార్పులు కోరుతూ ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి రావడంతో పరిస్థితి అదుపు తప్పింది. గురువారం రాత్రి నుంచి దేశమంతటా అంతర్జాల సేవలు, సమాచార 2 లో..



## చలి తీవ్రతకు వణుకుతున్న ఢిల్లీ..

**- దట్టమైన పొగమంచుతో వాహనాల రాకపోకలకు అంతరాయం**

మన గళం, న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో చలి తీవ్రత పీక్‌కు చేరింది. శనివారం ఉదయం నగరంలో కనిష్ట ఉష్ణోగ్రత 4.2 డిగ్రీలకు పడిపోయింది. ఈ సీజన్‌లో ఇదే అత్యల్ప ఉష్ణోగ్రతగా వాతావరణ 2 లో..

## ఆదరించండి.... అండగా ఉంటా !



**- న్యాయవాదుల సమస్యలు పరిష్కారమే లక్ష్యం**
**- ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ గా పోటీ చేస్తున్న బాలాజీ యలమంజుల**

మనగళం, ఎమ్మిగనూరు : న్యాయవాదులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి... వేయించి ఆదరించాలని... మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ గా పోటీ చేస్తున్న 2 లో..

### పచ్చని కోనసీమలో ఐదురోజుల
# ఉత్కంఠకు తెర

**- మోరి 5 బావిలో చెలరేగిన మంటలు పూర్తిగా అదుపులోకి - దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతో విజయవంతమైన ఆర్పివేత చర్యలు**

మన గళం, ఇరుసుమండ : పచ్చని కోనసీమను కలవరపెట్టిన మోరి-5 డ్రిల్లింగ్ బావి ప్రమాదానికి ఎట్టకేలకు ముగింపు లభించింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలో ఈనెల 5న గ్యాస్ లీకేజీ కారణంగా చెలరేగిన భారీ మంటలు ఐదురోజుల అనంతరం పూర్తిగా అదుపులోకి వచ్చాయి. వరుస పేలుళ్లు, ఎగిసిపడిన అగ్నిజ్వాలలతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటలు ప్రారంభమైన నాటి నుంచి చమురు సంస్థకు చెందిన అధికారులు, విపత్తు నివారణ నిపుణులు నిరంతరం శ్రమించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన నిపుణుల సహకారంతో పాటు అత్యాధునిక పరికరాలను ఉపయోగిస్తూ ప్రమాద ప్రాంతాన్ని పూర్తిగా భద్రపరిచారు. చివరికి పూర్తిగా దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతోనే మంటలను ఆర్పివేసి, దెబ్బతిన్న భాగాలను తొలగించి బావి మూసివేత పనులను విజయవంతంగా పూర్తిచేశారు. ఆపరేషన్ విజయవంతం కావడంతో విపత్తు నివారణ బృందం ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎంపీ హరీష్ స్పందిస్తూ, అతి తక్కువ సమయంలోనే ప్రమాదాన్ని నియంత్రించిన



బృందాన్ని అభినందించారు. మంటల కారణంగా నష్టపోయిన రైతులు, స్థానికులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిహారం అందిస్తామని వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన భద్రతా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## చిన్నారులతో జిల్లా కలెక్టర్ మమేకం!



**- నేలపై కూర్చుని ముచ్చటించిన డాక్టర్ సిరి**

మనగళం, కల్లూరు : ఆమె కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి... జిల్లా సర్వోన్నతాధికారి... అయినా చిన్నపిల్లలను చూడగానే తన హోదాను 2 లో..

## ఉపాధి కల్పనే ధ్యేయం

**- నంద్యాలకు రైల్వే పిట్ లైన్ కోసం ప్రత్యేక కృషి - స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు**
**- సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ - నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**

మనగళం, నంద్యాల : యువతకు ఉద్యోగం, ఉపాధి కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, ఆ దిశగా జాబ్ మేళాలలు చేపడుతున్నామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. నంద్యాలకు రైల్వే పిట్ లైన్ (లేదా వాషింగ్ పిట్ లైన్) కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నానని, విషయాన్ని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారన్నారు. ఈమేరకు కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ ఈ అంశాన్ని పరిశీలించి నివేదిక అందజేయాలని రైల్వే ఉన్నతాధికారులను ఆదేశించారని ఎంపీ గుర్తు చేశారు. రైల్వే పిట్ లైన్ వలన నంద్యాల 2 లో..



## రష్యా, చైనా కంటే ముందే గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటాం

ట్రంప్ మాట్లాడారు. గ్రీన్‌ల్యాండ్ అమెరికా జాతీయ భద్రతకు అత్యంత కీలకమని, అక్కడ అపార ఖనిజ వనరులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్కిటిక్ ప్రాంతంలో రష్యా, చైనా దేశాలు తమ సైనిక కార్యకలాపాలను వేగంగా పెంచుతున్న నేపథ్యంలో గ్రీన్‌ల్యాండ్‌ను నిర్లక్ష్యం చేయలేమని చెప్పారు. రష్యా, చైనా ముందడుగు వేయకముందే తాము చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. గ్రీన్‌ల్యాండ్‌లో ఇప్పటికే అమెరికాకు చెందిన ఒక సైనిక స్థావరం ఉన్న విషయాన్ని ట్రంప్ గుర్తు చేశారు. ఈ దీవి విషయంలో తాము వెనక్కి తగ్గబోమని, అవసరమైతే భిన్నమైన విధానాలు కూడా అనుసరిస్తామని చెప్పారు. ట్రంప్ వ్యాఖ్యలపై డెన్మార్క్‌తో పాటు పలు యూరోపియన్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు అంతర్జాతీయ వర్గాలు తెలిపాయి.

## ఇరాన్‌లో అట్టుడుకుతున్న నిరసనలు

వ్యవస్థలను నిలిపివేయడంతో ప్రజల్లో మరింత భయం నెలకొంది. తాజా ఆందోళనల్లో దాదాపు 200 మందికిపైగా మరణించినట్లు సమాచారం వెలుగులోకి వచ్చింది. టెహ్రాన్‌లోని పలు ఆసుపత్రుల ఆధారంగా ఒక వైద్యుడు వెల్లడించిన వివరాల ప్రకారం రాజధానిలోనే సుమారు 217 మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. దేశవ్యాప్తంగా ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశముందని ఆయన తెలిపారు. మృతుల్లో అధికంగా యువకులే ఉన్నట్లు తెలుస్తోంది. ఉత్తర టెహ్రాన్‌లోని పోలీస్ స్టేషన్ సమీపంలో భద్రతా దళాలు నిరసనకారులపై కాల్పులు జరిపినట్లు సమాచారం. ఈ ఘటనలోనే సుమారు 40 మంది అక్కడికక్కడే మృతి చెందినట్లు చెబుతున్నారు. ప్రభుత్వ కఠిన చర్యలతో పరిస్థితి మరింత తీవ్రంగా మారుతుండగా, ప్రజల్లో ఆందోళన, అసహనం రోజురోజుకూ పెరుగుతున్నాయి.

## చలి తీవ్రతకు వణుకుతున్న ఢిల్లీ..

శాఖ వెల్లడించింది. సాధారణ సగటుతో పోలిస్తే ఉష్ణోగ్రతలు 2.7 డిగ్రీల మేర తక్కువగా నమోదయ్యాయి. సఫ్దర్‌జంగ్‌లో 4.2, పాలంలో 4.5, లోధీ రోడ్డులో 4.7, రిడ్జ్‌లో 5.3, ఆయానగర్‌లో 4.5 డిగ్రీలుగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. తీవ్రమైన చలితో నగరవాసులు వణికిపోతూ చలిమంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు. అదే సమయంలో నగరమంతా దట్టమైన పొగమంచు కమ్ముకుంది. దృష్టి దూరం దాదాపు శూన్యానికి చేరడంతో రహదారులపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పొగమంచు ప్రభావంతో విమాన రాకపోకలపైనా పెద్ద ఎత్తున ప్రభావం పడింది. ఢిల్లీ విమానాశ్రయానికి వచ్చే, వెళ్లే అనేక విమానాలు రద్దుకాగా, కొన్ని ఆలస్యంగా నడిచాయి, మరికొన్నింటిని ఇతర నగరాలకు మళ్లించారు. మరోవైపు గాలి నాణ్యత అత్యంత దయనీయ స్థాయికి చేరింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం శనివారం ఉదయం నగర సగటు గాలి నాణ్యత సూచిక 358గా నమోదైంది. నెహ్రూ నగర్‌లో 426, ఆనంద్ విహార్‌లో 422, వివేక్ విహార్‌లో 408, సిరిఫోర్ట్‌లో 404, పట్పర్‌గంజ్‌లో 400, ద్వారకా సెక్టార్ 8లో 399, ఓఖ్లా ఫేజ్ 2లో 398, జేఎల్ఎన్ స్టేడియంలో 394, ఆర్కే పురం, చాందినీ చౌక్ ప్రాంతాల్లో 390, రోహిణిలో 372, పంజాబీ బాఘ్, ముంద్కా ప్రాంతాల్లో 368, అశోక్ విహార్‌లో 359, బావనాలో 346, ఆయా నగర్‌లో 344, అంతర్జాతీయ విమానాశ్రయ టర్మినల్ 3 వద్ద 325, అలీపూర్ ప్రాంతంలో 302గా గాలి నాణ్యత సూచిక నమోదు అయ్యింది. తీవ్రమైన చలి, కాలుష్యం నేపథ్యంలో ప్రజలు అత్యంత జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

# చిన్నారులతో జిల్లా కలెక్టర్ మమేకం!

మరిచిపోయారు. నేలపై కూర్చుని చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భానికి కల్లూరు మండలం, పందిపాడు గ్రామం అంగన్వాడీ కేంద్రం వేదిక అయ్యింది. శనివారం ఆ గ్రామంలో రాజముద్రతో కూడిన కొత్త పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. బుడిబుడి నడకల చిన్నారులను చూసిన జిల్లా కలెక్టర్ ఒక్కసారిగా మురిసిపోయారు. సందర్భం లేకుండా స్వేచ్ఛగా మాట్లాడుకుంటున్న చిన్నారుతో ముచ్చటించేందుకు కలెక్టర్ సైతం నేలపై కూర్చున్నారు. చిన్నపిల్లలతో అలానే ముచ్చటించారు జిల్లా కలెక్టర్. నేకేం వచ్చు.... నీవేం నేర్చుకున్నావ్... పొద్దున ఏం తిన్నావ్.... ఇలా చిన్నారులతో ముచ్చటించిన తీరు ఆకట్టుకుంది. ఎంతో హూందాగా వ్యవహరించే జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి... చిన్నపిల్లలతో ముచ్చటించిన తీరుకు అధికారులు సైతం ముగ్ధులయ్యారు. చిన్నపిల్లలను చూస్తే ఎవరైనా అంతే.... అనేందుకు జిల్లా కలెక్టర్ ముచ్చటించిన తీరే ప్రత్యక్ష సాక్ష

# ఆదరించండి.... అండగా ఉంటా !



బాలాజీ యలమంజుల పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం బాలాజీ యలమంజుల ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు బాలాజీకి ఘనంగా స్వాగతం పలికారు. అసోసియేషన్ నాయకులతో సమావేశమైన బాలాజీ వివిధ అంశాలపై చర్చించారు. గతంలో తాను న్యాయవాదులకు సహకరించిన సంఘటలనతోపాటు భవిష్యత్తు ప్రణాళికను బాలాజీ వివరించారు. దీంతో ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ నాయకులతోపాటు న్యాయవాదులు మూకుమ్మడిగా తమ మద్దతును తెలిపారు. అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని బాలాజీకి ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రషీదుల్లా, కార్యదర్శి ఎస్ ఆనంద్, కోశాధికారి మురళీకృష్ణ తదితర న్యాయవాదులు భరోసా ఇచ్చారు. అనంతరం బాలాజీ యలమంజుల మాట్లాడుతూ ఎమ్మిగనూరు నాయకులు, న్యాయవాదులతో ఉన్న సంబంధం నేటిది కాదన్నారు. తనను గెలిపిస్తే న్యాయవాదుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అంకితభావంతో పోరాడుతానని చెప్పారు. గతంలోనూ ఎన్నో సమస్యలను ముందుండి పోరాడిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కర్నూలు, అమరావతి లో అడ్వకేట్ భవన్ ఏర్పాటుకు, మహిళా న్యాయవాదులకు ఉచిత ఆరోగ్య బీమా కల్పించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. తదనంతరం బాలాజీ యలమంజులను నాయకులు, న్యాయవాదులు ఘనంగా సన్మానించి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో న్యాయవాదులు గురు ప్రసాద్, ఏసోబు, నారాయణ, ఎస్సై బాబు, దామోదర రెడ్డి, జగన్నాథ రెడ్డి, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

**పత్తికొండ సంఘటనపై న్యాయవాదుల పక్షాన పోరాడుతా...**

పత్తికొండలో కోర్టులో లొంగిపోవడానికి వచ్చిన ఓ నిందితుడితోపాటు న్యాయవాదిపై పోలీసులు వ్యవహరించిన తీరు అవమానకరమని ఓ విలేకరి గుర్తు చేయగా ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ గా పోటీ చేస్తున్న బాలాజీ యలమంజుల ఘాటుగా స్పందించారు. ఈ ఘటన న్యాయవాదికి మాత్రమే కాదని... ప్రతి పౌరుడికి జరిగిన అవమానం అని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు వ్యవహరించిన తీరు హేయమైన చర్యగా ఖండించారు. రాజ్యంగం, పార్లమెంట్ కల్పించిన హక్కులను హరించడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. న్యాయవాది పక్షాన న్యాయపోరాటం చేస్తామన్నారు. అదేవిధంగా న్యావాదుల రక్షణ చట్టం బిల్లు చర్చ దశలో ఉందని... ప్రభుత్వం సైతం సానుకూలంగా ఉందని గుర్తు చేశారు. న్యావాదుల రక్షణ చట్టం అమలుకు తమవంతు పోరాడుతామని ఈ సందర్భంగా బాలాజీ స్పష్టం చేశారు.

# ఉపాధి కల్పనే ధ్యేయం

వాసులకు ఉద్యోగాలు, ఉపాధి లభిస్తుందని, రైల్వే పిట్ లైన్ (లేదా వాషింగ్ పిట్ లైన్) అనేది ఒక నియమించబడిన ట్రాక్ అన్నారు. తరచుగా పట్టాల క్రింద ఒక తనిఖీ గొయ్యి ఉంటుందని, ఇది ప్రయాణీకుల కోచ్‌లు లేదా లోకోమోటివ్‌ల యొక్క సాధారణ శుభ్రపరచడం, తనిఖీ, పరీక్ష చిన్న నిర్వహణ కోసం ఉపయోగించబడుతుందన్నారు. దీని వలన సిబ్బంది రైలు కింద వైపులా సులభంగా పని చేయడానికి వీలు కల్పిస్తుందని, కడగడం, బోగీలను తనిఖీ చేయడం, తదుపరి ప్రయాణానికి ముందు భద్రతను నిర్ధారించడం వంటి పనులు చేస్తారన్నారు. కోచింగ్ డిపోలలో మొత్తం రేక్‌లకు సమర్థవంతంగా సేవ చేయడానికి, టర్నరౌండ్ సమయాన్ని తగ్గించడానికి, కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ఇవి కీలకమైనవి అని చెప్పారు. నంద్యాలలో ఈ పిట్ లైన్ ఏర్పాటు వల్ల వందల మంది స్థానికులకు కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు.

## నెలలో ఒకరోజైనా గ్రామాల్లో సేవలందించాలి



కాకినాడ, జనవరి 10 మనగళం, : వైద్యులు ఎంత బిజీగా ఉన్నప్పటికీ, కనీసం నెలలో ఒకరోజైనా గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలకు వెళ్లి పేద ప్రజలకు వైద్య సేవలు, అవగాహన శిబిరాలు నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు. వైద్యులు సమాజానికి అండగా నిలవాల్సిన బాధ్యత ఉందని, పేదలకు చికిత్స అందించడమే నిజమైన సేవాభావమని ఆయన పేర్కొన్నారు.

శనివారం కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న నూతన భవనాల నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "వైద్యో నారాయణో హరి అంటారు. అంటే వైద్యులు దేవుళ్లతో సమానం. తల్లిదండ్రులు జన్మనిస్తే, డాక్టర్లు మనకు పునర్జన్మనిస్తారు" అని వ్యాఖ్యానించారు. రంగరాయ మెడికల్ కళాశాల వైద్య విద్యతో పాటు మానవత్వం, సేవాభావాన్ని నేర్పే సంప్రదాయాన్ని కొనసాగిస్తోందని ప్రశంసించారు.

1958లో ప్రారంభమైన రంగరాయ మెడికల్ కళాశాల కాకినాడకు గర్వకారణమని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు కాకినాడ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ద్వారా ప్రతిరోజూ వేలాది మంది పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నదని తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య శాస్త్రాల విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పనిచేస్తూ ప్రతి సంవత్సరం వందలాది మంది వైద్యులను దేశానికి అందిస్తున్నదన్నారు. డాక్టర్ ఎం.వి. కృష్ణారావు, కల్నల్ డాక్టర్ డి.ఎస్. రాజు వంటి పెద్దల కృషితో, అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవ రెడ్డి చేతుల మీదుగా వంద మంది విద్యార్థులతో ఈ కళాశాల ప్రారంభమైందని గుర్తు చేశారు.

కళాశాల పునాదుల్లోనే సేవాగుణం దాగి ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. దాతల దాతృత్వం, ప్రభుత్వ సహకారంతో ఏర్పడిన ఈ సంస్థ భావి తరాలకు ప్రతిభావంతులైన వైద్యులను అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. రంగరాయ మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులు సంఘంగా ఏర్పడి రూ.10.11 కోట్ల వ్యయంతో నూతన భవనాల నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. బయోకెమిస్ట్రీ విభాగం, పరిపాలనా కార్యాలయాలు, లెక్చర్ హాళ్లు, నర్సింగ్ ల్యాబ్స్ వంటి ఆధునిక సదుపాయాలు ఈ భవనాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇది రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు.

యువత భవిష్యత్తు గురించి ప్రభుత్వం నిరంతరం ఆలోచిస్తోందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. యువతలో విశాల దృక్పథం రావాలని, కుల, మత, ప్రాంత బేధాల ఆలోచనలు వద్దని సూచించారు. విద్యా, వైద్య సంస్థలకు దాతలు పెద్ద మనసుతో చేసిన దానాలు అందరికీ ఉపయోగపడాలన్న సదుద్దేశంతోనేనని గుర్తు చేశారు. ప్రభుత్వం, కళాశాల, పూర్వ విద్యార్థులు కలిసి పనిచేస్తే రంగరాయ మెడికల్ కళాశాల మరింత ముందుకు వెళ్లడం ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.



## ఆర్డీపీ-2 పనులు త్వరలో ప్రారంభం

- నగరపాలక సంస్థ కమిషనర్ పిఅబశ్రీశ్రీ.విశ్వనాథ్
- కిడ్స్ వరల్డ్ నుండి బుధవారపేట బ్రిడ్జి వరకు రహదారి విస్తరణ
- 13న విస్తరణ రహదారి బాధితులతో సమావేశం
- ఆస్తిదారులకు టిడిఆర్ బాండ్లు, నష్టపరిహారం



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలోని కిడ్స్ వరల్డ్ నుండి వడ్డేగిరి, ఉస్మానియా కళాశాల మీదుగా బుధవార బ్రిడ్జి వరకు (ఆర్డీపీ-2) రహదారి విస్తరణ పనులను త్వరలో ప్రారంభిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం విస్తరణ బాధితులతో సమావేశం నిర్వహిస్తున్నామని, ప్రభావిత ఆస్థిదారులు ఎక్కడా ఉన్నా సమావేశానికి రావాలని కోరారు. సమస్యలు, సందేహాలను నివృత్తి చేసి, న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే 7 మందికి టిడిఆర్‌లు ఇచ్చామని, దాదాపు 30 మందికి టీడీఆర్‌లు ఇచ్చే ప్రక్రియ వేగంగా జరుగుతోందని, అది పూర్తైన వెంటనే అక్కడ విస్తరణ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. భవనాల నష్టపరిహారానికి సంబంధించి ఆస్థి విలువ వివరాలు ఆర్ అండ్ బీ శాఖ అధికారుల నుండి అందాయని, పరిహారాన్ని సైతం త్వరలో అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బాధితులు స్వచ్ఛంద సహకారం అందిస్తే, నగరాభివృద్ధిని మరింత వేగవంతం చేయవచ్చని కమిషనర్ తెలిపారు.

# క్రీడలతో ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసం

- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ - మున్సిపల్ ఉద్యోగులకు క్రీడా పోటీలు ప్రారంభం






మనగళం, కర్నూలు కార్పొరేషన్ : క్రీడల్లో పాల్గొనడం వల్ల ఉద్యోగుల్లో మానసిక ఒత్తిడి తగ్గి, ఉత్సాహం, సానుకూల దృక్పథం పెరుగుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. శనివారం మున్సిపల్ ఉద్యోగుల కోసం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో కమిషనర్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్రీడలు ఉద్యోగుల్లో సమన్వయం, పరస్పర సహకారం, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్, కౌన్సిల్ హాల్, ఇండోర్ స్టేడియం, ఔట్‌డోర్ స్టేడియంలలో ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. పురుష ఉద్యోగుల కోసం క్రికెట్, షటిల్, వాలీబాల్, క్యారమ్స్, చెస్, క్రీడలు, మహిళా ఉద్యోగుల కోసం త్రోబాల్, బ్యాడ్మింటన్, 100 మీటర్ల రన్నింగ్ రేస్, మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్, రంగోలి, షటిల్ క్రీడలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు ఈ క్రీడా పోటీలు నిర్వహించి, సంక్రాంతి పండుగ నాడు మహిళల కోసం ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ మనోహర్ రెడ్డి, డిసిపి వెంకటరమణ, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్, ఆర్ఓ జునైద్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కల తొలగింపు


- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ - 15 జేసీబీలతో రెండవ విడత స్వచ్ఛత పనులు - 3 డివిజన్లలో ఖాళీ స్థలాల శుభ్రతకు ప్రణాళిక



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కల తొలగింపు పనులు మరింత వేగవంతం చేయడమే లక్ష్యంగా ఆదివారం రెండో విడతగా విస్తృత స్వచ్ఛత పనులు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో పారిశుద్ధ్య తనిఖీదారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచే ప్రత్యేక డ్రైవ్‌ను 4వ పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 7, 12, 14వ శానిటేషన్ డివిజన్ల పరిధిలోని మొత్తం 127 ఖాళీ స్థలాల్లో 15 జేసీబీల సహాయంతో వంద శాతం పిచ్చి మొక్కలను తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. మూడు శానిటేషన్ డివిజన్ల పరిధిలోని ఖాళీ స్థలాలన్నింటినీ శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, అనంతరం ఇతర డివిజన్ల పరిధిలోని పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్, కార్యదర్శి నాగరాజు, శానిటేషన్ సూపర్వైజర్ ఎం.శ్రీనివాసరావు, శానిటేషన్ ఇంస్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అమర్నాథ్ రెడ్డికి నివాళి





మనగళం, కల్లూరు : కల్లూరు మండల పరిధిలోని పర్ల గ్రామానికి చెందిన అమర్నాథ్ రెడ్డి(37) అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. లివర్ సంబంధిత వ్యాధితో కర్నూలు పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందగా స్నేహితులు, బంధువులు నివాళులర్పించారు. మృతుడి స్నేహితులు బీ. వెంకటేష్, ఎం. శివ, బీ. పరుశురాం, కే. మాదన్న, కే. సురేష్, ఎన్. వెంకటేష్ తదితరులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు.

## దాతల సహాయంతో శ్రీ చౌడేశ్వరి దేవి తిరునాల కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తాం





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లాలో ప్రఖ్యాతి చెందిన కోడుమూరు శ్రీ చౌడేశ్వరి దేవి తిరునాల కార్యక్రమాలను ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహిద్దాం అని శ్రీ చౌడేశ్వరి దేవి తిరునాల క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల కమిటీ సభ్యులు శనివారం పేర్కొన్నారు ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కోడుమూరులోని దాతలు అందరిని కలిసి శ్రీ చౌడేశ్వరి దేవి జాతరకు కావలసిన మొత్తాన్ని వారి సహాయంతో సమకూర్చుకుంటున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ, అధికారులు, ప్రజలు, ప్రింట్ మీడియా, ఎలెక్ట్రానిక్ మీడియా, సోషియల్ మీడియా, ప్రతి ఒక్కరి సహకారంతో ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని వారు పిలుపునిచ్చారు. మూడు రోజులు జరిగే కార్యక్రమాలన్నిటికీ సుమారు 5 లక్షల వరకు ఈ ఏడాది కార్యక్రమాలకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. అందువలన ప్రజలు, భక్తులు, దాతల సహకారం ఎంతో అవసరమని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ ఖర్చుల నిమిత్తం విరాళాల సేకరణ కోసం ప్రతి ఒక్కరూ ముందుండి విరాళాలు సేకరించాలని తెలిపారు కోడుమూరు పట్టణంలో విరాళాలు సేకరించి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్క సభ్యుడు కృషి చేయాలని కమిటీ కోరింది ఈ కార్యక్రమంలో మన ఊరు మన జాతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


# ఫ్లిప్‌కార్ట్ రిపబ్లిక్ డే సేల్‌లో సగం ధరకే ఫోన్లు..




బెంగళూరు -- 10 జనవరి 2026 -- మన గళం : ఫ్లిప్‌కార్ట్ రిపబ్లిక్ డే సేల్ 2026 జనవరి మూడవ వారంలో ప్రారంభం కానుందని సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ భారీ సేల్‌కు సంబంధించిన వివరాల కోసం ప్రత్యేక మైక్రోసైట్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేల్‌లో ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు, బ్లూటూత్ స్పీకర్లు, ట్రూ వైర్‌లెస్ ఇయర్‌బడ్‌లు, టాబ్లెట్‌లు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు భారీ తగ్గింపు ధరలకు లభించనున్నాయి. ప్రముఖ బ్రాండ్ ఉత్పత్తులపై భారీ డిస్కౌంట్లు ఉంటాయని సంస్థ వెల్లడించింది. ఈ రిపబ్లిక్ డే సేల్ 2026 జనవరి 17 నుంచి ప్రారంభమవుతుంది. అయితే ఫ్లిప్‌కార్ట్ ప్లస్, ఫ్లిప్‌కార్ట్ బ్లాక్ సభ్యులకు జనవరి 16 నుంచే ముందస్తు యాక్సెస్ కల్పించనున్నారు. దేశంలో జరుపుకునే 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సేల్ నిర్వహించనున్నారు. ఈ సేల్‌లో బ్యాంక్ ఆఫర్లు ప్రధాన ఆకర్షణగా ఉండనున్నాయి. ఎంపిక చేసిన బ్యాంకుల క్రెడిట్, డెబిట్ కార్డులపై తక్షణ డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు, సులభమైన వాయిదాల చెల్లింపు సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. కొన్ని స్మార్ట్‌ఫోన్లు, ఇతర గాడ్జెట్లు 50 శాతం వరకు తగ్గింపు ధరలకే లభించే అవకాశం ఉందని సమాచారం. కొత్త సంవత్సరంలో ఎలక్ట్రానిక్స్ కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులకు ఈ సేల్ మంచి అవకాశంగా మారనుంది.

# మన ధర్మం... హిందూ ధర్మం

**– విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రాళ్ళబండి శర్మ వారి ధర్మ సూత్రాలు**




( ఆలూరు మనగళం ): ఆతిథ్య సత్కార – ధర్మములు

అతిథి అంటే ???

'న విద్యతే తిథిః యస్య సః' – అంటే, తిథి, వార, నక్షత్ర నియమం లేకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా అకస్మాత్తుగా ఇంటికి వచ్చేవాడు అని అర్థం.

అభ్యాగతః: అంటే స్వయంగా వెతుక్కుంటూ వచ్చినవాడు అని అర్థం.

మన ఇంటికి వచ్చిన అతిథికి మన దగ్గర ఏమీ లేకపోయినా కనీసం ఈ నాలుగు అందించాలని శాస్త్రం తృణాని భూమిరుదకం వాక్చతుర్థీ చ సూనృతా ఏతాన్యపి సతాం గేహే నోచ్ఛిద్యంతే కదాచన ఎఎ సజ్జనుల ఇళ్లలో ఈ నాలుగు వస్తువులు ఎప్పుడూ తక్కువ కావు

తృణాని: కూర్చోవడానికి చాప లేదా ఆసనం.

భూమిః: విశ్రాంతి తీసుకోవడానికి స్థలం.

ఉదకం: దాహాన్ని తీర్చడానికి నీరు.

సూనృతా వాక్: ప్రియమైన (మంచి) మాట. శత్రువు వచ్చినా ఆదరించాలి మహాభారతంలోని శాంతి పర్వం ప్రకారం, శత్రువు ఇంటికి వచ్చినా అతనికి తగిన గౌరవం ఇవ్వాలని ఉన్నది.

అసంపన్నః కులే?పి స్యాదాగతః పరమో?తిథిః ఎ

యథశక్తి ప్రపూజ్యో?యం న త్వపూజ్యో విసర్జయేత్ ఇంటికి వచ్చిన వాడు ఏ కులస్థుడైనా, ఏ హోదాలో ఉన్నవాడైనా అతను గొప్ప అతిథే , శక్తి ఉన్నంతలో అతడిని పూజించి పంపాలి కానీ, అవమానించి పంపకూడదు.

అతిథిని పంపేటప్పుడు (ప్రదక్షిణ పూర్వకం) అతిథి వెళ్లేటప్పుడు కూడా వారి పట్ల గౌరవాన్ని ప్రదర్శించాలని శాస్త్రం. అభిగమ్యోత్తమం విద్వాన్ ప్రణమ్య చ యథవిధి ఎ అనుగమ్య చ సీమాంతం విసృజేత్ ప్రియవాక్యతః అతిథి వెళ్లేటప్పుడు వారిని సాగనంపడానికి ఇంటి గడప దాటి కొంత దూరం వరకు (గ్రామ పొలిమేర వరకు అని పూర్వకాలంలో అనేవారు) వెళ్లి, ప్రియమైన మాటలు చెప్పి పంపాలి. చెట్టు తనను నరకడానికి గొడ్డలి పట్టుకుని వచ్చిన వాడికి కూడా నీడను ఇస్తుంది. ఆ దృష్టాంతంతో ఆతిథ్యం గురించి ఇలా

ఛేత్తురప్యాశ్రయం ఛాయాం నోపసంహరతే ద్రుమః ఎ

అతిథిం పూజయేత్తస్మాత్ యథశక్తి విధానతః తనను నరికే వానికి కూడా చెట్టు నీడను ఇవ్వడం మానదు. అలాగే మనిషి కూడా తన శక్తి మేరకు ఇంటికి వచ్చిన అతిథిని పూజించాలి.

అతిథిని నిరాశపరచకూడదు అతిథి నిరాశతో వెనుదిరిగి వెళితే, అది ఇంటి యజమానికి శ్రేయస్కరం కాదు. అతిథిర్యస్య భగ్నాశో గృహాత్ప్రతినివర్తతే స తస్మై దుష్కృతం దత్త్వా పుణ్యమాదాయ గచ్ఛతి ఎఎ

ఎవరి ఇ ఇంటి నుండైతే అతిథి ఆశ కోల్పోయి (ఆదరణ లభించక) తిరిగి వెళ్ళిపోతాడో, ఆ అతిథి తన పాపాన్ని ఇంటి యజమానికి ఇచ్చి, ఆ యజమాని చేసుకున్న పుణ్యాన్ని తాను తీసుకువెళతాడు. ఇలా అతిథి అంటే తిథి, వారం చెప్పకుండా అకస్మాత్తుగా వచ్చేవారు ఆ అతిథిని సంతోషపెడితే సకల దేవతలు సంతోషించినట్లేనని మన పురాణాలు వచనం.

---------------------------------------------------

ఆ ఆతిథ్యం పొందే వ్యక్తి పాటించాల్సిన నియమాలులి????? అతిథి నిర్వచనం

"ఏక రాత్రం తు నివసన్ అతిథిర్ బ్రాహ్మణః స్మృతః

నానిత్యం హి స్థితో యస్మాత్ తస్మాద్ అతిథిరుచ్యతే ఎఎ"ఒకే రాత్రి నివసించేవాడిని 'అతిథి' అంటారు. అంటే, వచ్చిన వ్యక్తి ఎక్కువ కాలం ఉండి యజమానికి భారం కాకూడదని దీని అర్థం. తిథి, వార నియమాలు లేకుండా వచ్చి, కొద్దిసేపు లేదా ఒక రాత్రి మాత్రమే ఉండి వెళ్ళేవాడే నిజమైన అతిథి. ఒకరి ఇంటికి వెళ్ళినప్పుడు ప్రవర్తన ఎవరైనా ఇంటికి వెళ్ళినప్పుడు ఆ ఇంటి పరిస్థితులను గౌరవించాలి "అమంత్రితాః ప్రవిశంతి హ్యకృతాశ్చైవ భాషిణః ఎ

అవిశ్వస్తే విశ్వసంతి మూఢచేతా నరాధమః ఎఎ" పిలవకుండా లోపలికి వెళ్ళేవాడు, అడగకుండానే అతిగా మాట్లాడేవాడు, నమ్మకూడని వారిని నమ్మేవాడు "మూఢుడు" (తెలివి తక్కువ వాడు) అని పిలవబడతాడు. కాబట్టి అతిథిగా వెళ్ళినప్పుడు అనుమతి కోరడం, మితంగా మాట్లాడటం చాలా ముఖ్యం. భోజనం విషయంలో అతిథి ధర్మం ఆ అతిథి భోజనం పెట్టినప్పుడు ఎలా ఉండాలి "న నింద్యాత్ అన్నం తద్ వ్రతము పెట్టే ఆహారం రుచిగా ఉన్నా, లేకపోయినా దాన్ని నిందించకూడదు. యజమాని ఎంత ప్రేమతో పెట్టాడో గమనించి, తృప్తిగా భుజించాలి. వడ్డించేవారిని ఇబ్బంది పెట్టేలా కోరికలు కోరకూడదు.

వినయం మరియు గౌరవం : అతిథికి ఉండాల్సిన లక్షణాల గురించి భర్తృహరి సుభాషితాలలో ఇలా ఉంది

"ప్రియతమమ్ వినయేన సమాచరేతు ఎక్కడికి వెళ్ళినా వినయంతో ప్రవర్తించాలి. అతిథిగా వెళ్ళినప్పుడు మన గొప్పలు చెప్పుకోవడం కంటే, ఆ ఇంటి యజమానిని గౌరవించడం ఉత్తమ లక్షణం.సదాచారం సత్ప్రవర్తన "దురాచారో హి పురుషో లోకే భవతి నిందితః ఎ

దుఃఖభాక్ చ సతతం వ్యాధితో?ల్పాయురేవ చ ఎఎ" పరుల ఇంటికి వెళ్ళినప్పుడు దుష్ప్రవర్తన (చెడు పనులు, దొంగతనంగా చూడటం, రహస్యాలు వినడం) చేసే వ్యక్తి సమాజంలో నిందల పాలవుతాడు. కాబట్టి అతిథి ఎప్పుడూ పరిశుభ్రతను, పద్ధతిని పాటించాలి. సంక్షిప్తంగా అతిథి పాటించాల్సిన నియమాలు చూద్దాం (జష్ట్రవఎశ్రీఅర్)నియమం వివరణ అనుమతి (ప్రవతీఎఅంంఅశీఅ) ఏ వస్తువునైనా తాకేముందు, ఏ గదిలోకి వెళ్ళేముందు యజమానిని అడగాలి. మితభాషణం (౧అఎత్‌వస ౧జూవవఎష్ట్ర) అనవసరమైన మాటలు, వ్యక్తిగత ప్రశ్నలు మానుకోవాలి. సమయపాలన (౧అఎఅఅస్త్ర) భోజన సమయాల్లో లేదా పడుకునే వేళల్లో ఇబ్బంది కలిగించకూడదు. సహకారం (జశీశీజూవతీఫ్‌అశీఅ) వీలైతే ఆ ఇంట్లోని చిన్న చిన్న పనుల్లో సహాయం చేయాలి, భారం కాకూడదు. కృతజ్ఞత (+తీఫ్‌ఙబఎవ) తిరిగి వచ్చేటప్పుడు ఆదరించినందుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు చెప్పాలి.

---------------------------------------------------

-- పరస్పరం ఇద్దరి బాధ్యత ధర్మాలు???? బంధువులు లేక మిత్రులు మధ్య ఉండాల్సిన అనుబంధం (స్నేహ భావం) సతాం సద్భిః సమాగమః కథమపి పుణ్యేన భవతి సదా మిత్రం చక్షుర్విశదమపి భావార్ద్రమతులమ్ ఎఎ సజ్జనులకు (మంచి వారికి), సజ్జనులతో కలిగే కలయిక, ఏదో ఒక గొప్ప పుణ్యం వల్ల మాత్రమే సాధ్యమవుతుంది, అటువంటి మిత్రుడు ఎల్లప్పుడూ, కళ్లకు స్పష్టతను (జ్ఞానాన్ని) ఇచ్చేవాడు ,సాటిలేని హృదయపూర్వకమైన అనురాగాన్ని ఇచ్చేవాడు.

మహాభారతంలో విదుర నీతి ప్రకారం, నిజమైన స్నేహితుల మధ్య ఉండవలసిన లక్షణాలు.

దదాతి ప్రతిగృహ్ణాతి గుహ్యామాఖ్యాతి పృచ్ఛతి ఎ

భుంక్తే భోజయతే చైవ షడ్విధం ప్రీతిలక్షణమ్ ఎఎ

ఇచ్చిపుచ్చుకోవడం (కానుకలు), రహస్యాలను పంచుకోవడం, కుశల ప్రశ్నలు అడగడం, వారి ఇంట్లో భుజించడం, మన ఇంట్లో వారికి భోజనం పెట్టడం---ఈ ఆరు పనులు స్నేహానికి, ప్రేమకు నిదర్శనాలు. అకౌతుకాని గేహాని న గంతవ్యాని కర్హిచిత్ ఎ

అప్యుత్సవగతైర్నృభిః కిం పునః సామాన్యకర్మణి ఎఎ

మనపై ఆదరాభిమానాలు లేని వారి ఇంటికి వెళ్ళకూడదు. కానీ, మన క్షేమాన్ని కోరేవారు, మన రాకను ఆశించే వారి ఇంటికి ఆహ్వానం ఉన్నా లేకపోయినా వెళ్ళడం వల్ల ఆ బంధం పటిష్టమవుతుంది ఇది మన భారతీయ సాంప్రదాయం. ఈ కార్యక్రమంలో శ్రీ గోవింద నారాయణ మహాదేవ రాళ్ళబండి శర్మ, మరియు విశ్వహిందూ పరిషత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



మనగళం, ఆదోని : ఆదోని పట్టణంలో గత ఇరవై రోజుల క్రితం అత్యాచారానికి గురై హత్యగావించబడిన దళిత మహిళ కుటుంబాన్ని ఆదుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి తిక్కప్ప, నాయకుడు వీరేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మనేరకు శనివారం వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత మహిళపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కుల దురహంకారంతో జరిగిన ఘటనేనని, కేసును అత్యాచారం అట్రాసిటీ హత్యగా మార్చి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వసంత, రాజు, చిన్న వీరేష్, కాసిం యేసు, రాజారత్నం, నరసింహులు, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బీఐ కస్టమర్లకు రూ.2 లక్షల వరకు రుణం..




హైదరాబాద్ -- 10 జనవరి 2026 -- మనగళం : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతా ఉన్న వారికి శుభవార్త. బ్యాంక్ తన అర్హత కలిగిన ఖాతాదారులకు ఎలాంటి పత్రాలు లేకుండా, పూర్తిగా డిజిటల్ విధానంలో రూ.2 లక్షల వరకు వ్యక్తిగత రుణం అందిస్తోంది. అకస్మాత్తుగా డబ్బు అవసరం వచ్చినప్పుడు ఈ సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా మారనుంది.

బ్యాంక్ అమలు చేస్తున్న రియల్ టైమ్ ఎక్స్‌ప్రెస్ క్రెడిట్ పథకం ద్వారా అర్హులైన ఖాతాదారులు మరింత ఎక్కువ మొత్తంలో కూడా రుణం పొందే అవకాశం ఉంది. ఈ పథకం ముఖ్యంగా జీతం ఖాతా ఉన్న కస్టమర్ల కోసం రూపొందించబడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రక్షణ రంగం, కార్పొరేట్ రంగాల్లో పని చేసే వారు ఈ రుణానికి అర్హులు.

రుణం పొందేందుకు ఖాతాదారులు బ్యాంక్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేయాలి. ఆధార్ ఆధారిత ఓటీపీ ద్వారా ఈ సంతకం పూర్తవుతుంది. రుణ అర్హత, క్రెడిట్ స్కోరు పరిశీలన, ఆమోదం వంటి అన్ని ప్రక్రియలు ఆన్‌లైన్‌లోనే పూర్తవుతాయి. దీంతో రుణం చాలా తక్కువ సమయంలోనే ఖాతాలో జమ అవుతుంది.

ఈ రుణానికి కనీసం నెలకు రూ.15000 ఆదాయం ఉండాలి. నెలవారీ వాయిదా చెల్లింపులు మొత్తం ఆదాయంలో 50 నుంచి 60 శాతం లోపే ఉండాలి. క్రెడిట్ స్కోరు 650 నుంచి 700 కంటే ఎక్కువగా ఉండాలి. వడ్డీ రేట్లు రెండేళ్ల మార్జినల్ ఖర్చు ఆధారిత రేటుతో అనుసంధానమై ఉంటాయి. రుణ కాలం మొత్తం ఒకే వడ్డీ రేటు వర్తిస్తుంది.

బ్యాంక్ శాఖలకు తిరగాల్సిన అవసరం లేకుండా, ఇంటి నుంచే రుణం పొందే ఈ అవకాశాన్ని అర్హులైన ఖాతాదారులు వినియోగించుకోవాలని బ్యాంక్ సూచిస్తోంది.

# శాంతి--సామరస్యానికి ఆధ్యాత్మిక బోధలే బలమైన పునాది

**పోలీసు శాఖకు పాస్టర్ల సహకారం అవసరం -- దోర్నాల ఎస్సై ఎస్. వెంకట రమణయ్య**

మన గళం పెద్దదోర్నాల, : సమాజంలో శాంతి, సామరస్యం నిలకడగా ఉండాలంటే ఆధ్యాత్మిక బోధలే బలమైన పునాదిగా మారాలని దోర్నాల ఎస్సై ఎస్. వెంకట రమణయ్య అన్నారు. ప్రజలను సన్మార్గంలో నడిపిస్తూ క్రమశిక్షణ గల సమాజ నిర్మాణంలో పాస్టర్లు కీలక పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు. పెద్దదోర్నాల మండల క్రిస్టియన్స్ పాస్టర్స్ అండ్ ఇవాంజెలిస్ట్ వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీ అధ్యక్షుడిగా డి.పి. యేసయ్య ఎన్నికైన నేపథ్యంలో శనివారం స్థానిక క్రీస్తు సంఘం చర్చిలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై ఎస్. వెంకట రమణయ్య నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.




ఈ సందర్భంగా మండలంలోని పాస్టర్లు ఎస్సై వెంకట రమణయ్యను పూలమాలలు, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పాస్టర్లు తమ సందేశాల ద్వారా ప్రజల్లో ప్రేమ, సహనం, ఐక్యతను పెంపొందించాలని సూచించారు. చట్టం పట్ల గౌరవం పెరిగేలా ప్రజలను చైతన్యపరచడంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు సంపూర్ణ



సహకారం అందించాలని కోరారు. సమాజ శ్రేయస్సే లక్ష్యంగా పనిచేసే పాస్టర్ల సేవలు ప్రజలకు ఆదర్శంగా నిలవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పాస్టర్ల సంఘం యూనియన్ నాయకులు బొప్పూరి ప్రభుదాసు, డి. యోహాను, దర్శనం పెద్దయేసయ్య, చాట్ల శ్యామ్, తంగిరాల యాకోబు, అబ్రహం నాయక్, యోబు, శాంతి వర్ధన్, సురేష్, చంద్రతో పాటు పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..

మన గళం

దిన పత్రిక


# సంపాదకీయం


## కృతజ్ఞతకు విలువ తగ్గిందా? మనసు మాట మరిచిన సమాజం

మన జీవితం ఒక పొడవైన ప్రయాణం. ఆ ప్రయాణంలో ప్రతి అడుగు మన ఒంటరి శ్రమ ఫలితమా? నిజంగా అలా అనుకోవడం మన ఆత్మవంచన మాత్రమే. మన పుట్టుక నుంచి ఈ క్షణం వరకు మన వెనుక నిలబడి, కనిపించకుండా సహాయం చేసిన చేతులు ఎన్నో ఉన్నాయి. తల్లిదండ్రులు తమ జీవితాలను త్యాగం చేసి పిల్లల భవిష్యత్తును నిర్మిస్తారు. గురువులు తమ జ్ఞానాన్ని పంచి దారి చూపుతారు. స్నేహితులు కష్టసమయంలో భుజం ఇస్తారు. కొన్నిసార్లు అపరిచితుల సహాయం కూడా మన జీవితాన్ని మలుపుతిప్పుతుంది. కానీ ఈ సహాయాలన్నింటినీ మనం గుర్తుంచుకుంటున్నామా? లేక విజయానికి చేరుకున్న తర్వాత, ఈ మూలాలను మరిచిపోతున్నామా అన్న ప్రశ్న ఇప్పుడు సమాజాన్ని వెంటాడుతోంది. ఒకప్పుడు కృతజ్ఞత మన సంస్కృతిలో భాగంగా ఉండేది. పెద్దల పట్ల గౌరవం, ఉపకారాన్ని గుర్తుంచుకునే స్వభావం మనకు సహజంగా ఉండేది. ఎవరో చేసిన మేలు జీవితాంతం గుర్తుంచుకుని, అవసరమైనప్పుడు ప్రతిఫలం చెల్లించాలనే భావన ఉండేది. కానీ కాలం మారింది. ఆధునిక జీవనశైలి, తీవ్ర పోటీ, స్వార్థపు ఆలోచనలు మన మనసులను ఆక్రమించాయి. ఎదుగుదలనే లక్ష్యంగా పెట్టుకున్న ఈ ప్రయాణంలో, మనల్ని ముందుకు నడిపించిన వారిని వెనక్కి నెట్టే పరిస్థితి కనిపిస్తోంది. 'నేనే చేశాను', 'నాకెవరి అవసరం లేదు' అనే భావన పెరుగుతోంది. ఇది కేవలం వ్యక్తిగత అహంకారం కాదు, ఇది సమాజంలో విలువల పతనానికి సంకేతం. నేటి సమాజంలో 'ధన్యవాదాలు' అనే మాట వినిపించడం అరుదైపోతోంది. అవసరం ఉన్నంతవరకే సంబంధాలు, అవసరం తీరాక మౌనం. పని పూర్తయ్యాక మనుషులు కూడా ఉపయోగపడిన వస్తువుల్లా పక్కకు నెట్టబడుతున్నారు. సోషల్ మీడియా యుగంలో కృతజ్ఞత కూడా ఒక ఫార్మాలిటీగా మారింది. ఒక మెసేజ్, ఒక ఎమోజీ, ఒక 'లైక్'తో సరిపెట్టుకుంటున్నాం. కానీ ఇవి నిజమైన కృతజ్ఞతకు ప్రత్యామ్నాయమా? హృదయపూర్వకంగా చెప్పే ఒక్క మాట, మనస్ఫూర్తిగా చేసే ఒక పని ఇచ్చే సంతృప్తిని ఇవి ఇవ్వలేవు. మనిషి–మనిషి మధ్య బంధాలను నిలబెట్టేది సాంకేతికత కాదు, భావోద్వేగం. కృతజ్ఞత లేకపోతే మనిషి కఠినుడవుతాడు. తన అవసరాలే ప్రపంచమని భావిస్తాడు. అలాంటి వ్యక్తులతో కూడిన సమాజం చివరికి నమ్మకాన్ని కోల్పోతుంది. ఒకరినొకరు గుర్తించని పరిస్థితి, పరస్పర గౌరవం లేని వాతావరణం సామాజిక విఘటనకు దారితీస్తుంది. నేటి రోజుల్లో పెరుగుతున్న ఒంటరితనం, సంబంధాల్లో శూన్యత ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. మన చుట్టూ జనాలు ఉన్నా, మనసుకు దగ్గరగా ఉండేవాళ్లు లేని పరిస్థితి ఎందుకు వచ్చిందో ఆలోచించాల్సిన సమయం ఇది. కృతజ్ఞత కోల్పోయిన సమాజం భావోద్వేగంగా దరిద్రంగా మారుతుందన్నది కఠినమైన నిజం. అంతర్జాతీయ థ్యాంక్ యూ డే మనకు ఒక హెచ్చరికలా నిలుస్తోంది. ఇది కేవలం ఒక రోజుకు పరిమితమైన ఆచారం కాదు. మన జీవన విధానాన్ని పునరాలోచించాల్సిన సందర్భం. మన ఇంట్లో తల్లిదండ్రులకు మనం నిజంగా కృతజ్ఞత చూపుతున్నామా? గురువులను అవసరం ఉన్నప్పుడే గుర్తు చేసుకుంటున్నామా? కార్యాలయాల్లో సహకరించిన సహోద్యోగులను, కష్టసమయంలో తోడుగా నిలిచిన వారిని మనం ఎంతవరకు గుర్తుంచుకుంటున్నాం? ఈ ప్రశ్నలకు మనస్ఫూర్తిగా సమాధానం చెప్పుకోగలిగితేనే ఈ దినోత్సవానికి అర్థం ఉంటుంది. కృతజ్ఞత చెప్పడం మన స్థాయిని తగ్గించదు. అది మన వ్యక్తిత్వాన్ని మరింత గొప్పగా చేస్తుంది. వినయం, మానవత్వం, పరస్పర గౌరవం ఇవన్నీ కృతజ్ఞత నుంచే పుడతాయి. ఒక సమాజం నిజంగా ఎదగాలంటే ఆర్థిక అభివృద్ధితో పాటు భావోద్వేగ సంపద కూడా అవసరం. ఆ సంపదకు మూలం కృతజ్ఞత. కనీసం ఈ రోజైనా మన జీవితంలో వెలుగులు నింపిన వారిని గుర్తు చేసుకుని, మనస్ఫూర్తిగా "ధన్యవాదాలు" చెప్పగలిగితే అదే అంతర్జాతీయ థ్యాంక్ యూ దేకు నిజమైన నివాళి.

మన జీవితం ఒక పొడవైన ప్రయాణం. ఆ ప్రయాణంలో ప్రతి అడుగు మన ఒంటరి శ్రమ ఫలితమా? నిజంగా అలా అనుకోవడం మన ఆత్మవంచన మాత్రమే. మన పుట్టుక నుంచి ఈ క్షణం వరకు మన వెనుక నిలబడి, కనిపించకుండా సహాయం చేసిన చేతులు ఎన్నో ఉన్నాయి. తల్లిదండ్రులు తమ జీవితాలను త్యాగం చేసి పిల్లల భవిష్యత్తును నిర్మిస్తారు. గురువులు తమ జ్ఞానాన్ని పంచి దారి చూపుతారు. స్నేహితులు కష్టసమయంలో భుజం ఇస్తారు. కొన్నిసార్లు అపరిచితుల సహాయం కూడా మన జీవితాన్ని మలుపుతిప్పుతుంది. కానీ ఈ సహాయాలన్నింటినీ మనం గుర్తుంచుకుంటున్నామా? లేక విజయానికి చేరుకున్న తర్వాత, ఈ మూలాలను మరిచిపోతున్నామా అన్న ప్రశ్న ఇప్పుడు సమాజాన్ని వెంటాడుతోంది. ఒకప్పుడు కృతజ్ఞత మన సంస్కృతిలో భాగంగా ఉండేది. పెద్దల పట్ల గౌరవం, ఉపకారాన్ని గుర్తుంచుకునే స్వభావం మనకు సహజంగా ఉండేది. ఎవరో చేసిన మేలు జీవితాంతం గుర్తుంచుకుని, అవసరమైనప్పుడు ప్రతిఫలం చెల్లించాలనే భావన ఉండేది. కానీ కాలం మారింది. ఆధునిక జీవనశైలి, తీవ్ర పోటీ, స్వార్థపు ఆలోచనలు మన మనసులను ఆక్రమించాయి. ఎదుగుదలనే లక్ష్యంగా పెట్టుకున్న ఈ ప్రయాణంలో, మనల్ని ముందుకు నడిపించిన వారిని వెనక్కి నెట్టే పరిస్థితి కనిపిస్తోంది. 'నేనే చేశాను', 'నాకెవరి అవసరం లేదు' అనే భావన పెరుగుతోంది. ఇది కేవలం వ్యక్తిగత అహంకారం కాదు, ఇది సమాజంలో విలువల పతనానికి సంకేతం. నేటి సమాజంలో 'ధన్యవాదాలు' అనే మాట వినిపించడం అరుదైపోతోంది. అవసరం ఉన్నంతవరకే సంబంధాలు, అవసరం తీరాక మౌనం. పని పూర్తయ్యాక మనుషులు కూడా ఉపయోగపడిన వస్తువుల్లా పక్కకు నెట్టబడుతున్నారు. సోషల్ మీడియా యుగంలో కృతజ్ఞత కూడా ఒక ఫార్మాలిటీగా మారింది. ఒక మెసేజ్, ఒక ఎమోజీ, ఒక 'లైక్'తో సరిపెట్టుకుంటున్నాం. కానీ ఇవి నిజమైన కృతజ్ఞతకు ప్రత్యామ్నాయమా? హృదయపూర్వకంగా చెప్పే ఒక్క మాట, మనస్ఫూర్తిగా చేసే ఒక పని ఇచ్చే సంతృప్తిని ఇవి ఇవ్వలేవు. మనిషి–మనిషి మధ్య బంధాలను నిలబెట్టేది సాంకేతికత కాదు, భావోద్వేగం. కృతజ్ఞత చెప్పడం మన స్థాయిని తగ్గించదు. అది మన వ్యక్తిత్వాన్ని మరింత గొప్పగా చేస్తుంది. వినయం, మానవత్వం, పరస్పర గౌరవం ఇవన్నీ కృతజ్ఞత నుంచే పుడతాయి. ఒక సమాజం నిజంగా ఎదగాలంటే ఆర్థిక అభివృద్ధితో పాటు భావోద్వేగ సంపద కూడా అవసరం. ఆ సంపదకు మూలం కృతజ్ఞత. కనీసం ఈ రోజైనా మన జీవితంలో వెలుగులు నింపిన వారిని గుర్తు చేసుకుని, మనస్ఫూర్తిగా "ధన్యవాదాలు" చెప్పగలిగితే అదే అంతర్జాతీయ థ్యాంక్ యూ దేకు నిజమైన నివాళి.

# పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా జి. పద్మనాభరెడ్డి బాధ్యతలు స్వీకరణ





మన గళం పెద్ద దోర్నాల : పెద్ద దోర్నాల మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జి. పద్మనాభరెడ్డి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందడంతో నేడు మండల పరిషత్ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం కార్యాలయ పరిపాలనా వ్యవహారాలను సమీక్షించిన పద్మనాభరెడ్డి, సిబ్బందితో సమావేశమై మండల పరిషత్ కార్యకలాపాలపై అవగాహన పొందారు. కార్యాలయ పనితీరు మరింత సమర్థవంతంగా ఉండేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద దోర్నాల ఎంపీడీవో టి.ఎల్. ప్రసూనాదేవి పాల్గొని పద్మనాభరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కార్యాలయ సిబ్బంది, అధికారులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై అభినందనలు తెలియజేశారు.

పదోన్నతి సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆఫీస్ సబార్డినేట్ సంగుభట్ల శ్రవణ్ కుమార్ శర్మ శాలువాలతో చిరు సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పద్మనాభరెడ్డి మాట్లాడుతూ, తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనను మరింత పారదర్శకంగా, ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# బూడిదపాడు గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించాలి

**– బీజేపీ యువ మోర్చా కోడుమూరు అసెంబ్లీ ఇంచార్జ్ వంగూరు రాజు యాదవ్**



మనగళం, గూడూరు : గూడూరు మండల పరిధిలోని బూడిదపాడు గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ యువ మోర్చా కోడుమూరు అసెంబ్లీ ఇంచార్జ్ వంగూరు రాజు యాదవ్ డిమాండ్ చేశారు. మౌలిక వసతులు లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న వంగూరు రాజు యాదవ్ శనివారం బూడిదపాడు గ్రామంలో పర్యటించారు. ఆయా కాలనీలలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. సమస్యలు తెలుసుకున్న ఆయన గత ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు సీసీ రోడ్డు వేయించాలని పాలకులు, అధికారులకు విన్నవించినా స్పందన లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన ఆయన గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తప్పుపడుతూ స్థానికులతో కలిసి మురుగురోడ్డుపై బైఠాయించిన నిరసన తెలిపారు. కూటమి సర్కార్ లోనైనా సీసీ రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వంగూరు రాజు యాదవ్ అధికారులను కోరారు. బూడిదపాడు గ్రామస్తుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. కనీస వసతులు కరువై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేనందున మురుగునీరు రోడ్లపై చేరి దుర్వాసన వస్తుందని, ప్రజలు అనారోగ్యానికి గురువుతన్నారని విచారం వ్యక్తం చేశారు. అనతరం ఆయన సమస్యను పంచాయతీ రాజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బూడిదపాడు గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించడానికి తమవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా గ్రామస్తులకు వంగూరు రాజు యాదవ్ హామీ ఇచ్చారు. కార్యక్రమం లో బీజేపీ కార్యకర్తలు మున్నా, రసూల్, బషీర్, సూరి తదితరులు పాల్గొన్నారు.

# రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు


**– రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం – కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



మనగళం, కల్లూరు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో రైతులకు పాత భూ హక్కు పత్రాల స్థానంలో రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. శనివారం కల్లూరు మండలం పందిపాడు గ్రామ సచివాలయంలో మీ భూమి మీ హక్కు కార్యక్రమం లో భాగంగా రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల ప్రయోజనాల గురించి వివరిస్తూ కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలలో క్యూఆర్ కోడ్ కూడా ఉంటుందని, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే సంబంధిత పొలం వివరాలన్నీ వస్తాయన్నారు. పొలానికి సంబంధించిన అక్షాంశం, రేఖాంశాన్ని ఇతరులు ఎవరు మార్చలేరన్నారు. ఈ పట్టాదారు పాస్ పుస్తకాన్ని ఇతరులు ఎవరు డూప్లికేట్ చేయలేరన్నారు. జాయింట్ ఎల్పిఎం లాంటి సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని కలెక్టర్ రైతులకి సూచించారు. రైతుల పాసుపుస్తకాలు ఎవరివైనా బ్యాంకులో ఉన్నట్లయితే బ్యాంకు వారితో తహసీల్దార్ మాట్లాడి పాత పాస్ పుస్తకాల స్థానంలో కొత్త పాస్ పుస్తకాలను రీప్లేస్ చేస్తారని కలెక్టర్ రైతులకు తెలిపారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ క్లినిక్ లను ఏర్పాటు చేశామని, పట్టా భూమి ఇనాం భూమిగా, దేవాదాయ భూమి కింద, 22 ఏ కింద పొరపాటున పడడం, చుక్కల భూముల సమస్యలు, వెబ్ ల్యాండ్ కరెక్షన్స్ తదితర రెవెన్యూ సమస్యల పై ప్రత్యేక దృష్టి సారించి రెండు,మూడు నెలలలో రెవెన్యూ భూ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రైతులకు రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను అందచేశారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# చిరంజీవి రుద్విశ్రీ కు శతమానం భవతి

**– రుద్విశ్రీ జన్మదిన వేడుకలో ఆశీర్వదించిన టీడీపీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి.**





( ఆలూరు మనగళం ): ఆలూరు మండల కేంద్రంలో జనసేన పార్టీ ఐటీ కోఆర్డినేటర్ రంజిత్ కుమార్ మరియు జనసేన పార్టీ మండల కన్వీనర్ వినయ్ (ఛత్రపతి) ఆహ్వానం మేరకు, రంజిత్ కుమార్ కుమార్తె

చి, రుద్విశ్రీ మొదటి జన్మదిన వేడుకలకు ముఖ్య అధితులుగా హాజరైన ఆలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి. ఆహ్వానం మన్నించి వేడుకకు వచ్చిన టీడీపీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి ను ఆలూరు సొసైటీ సింగల్ విండో డైరెక్టర్ సునంద శాలవతో సత్కరించారు. చిన్నారి రుద్విశ్రీ జన్మదిన వేడుకలలో కేకుకట్ చేసి పాపకు తినిపించారు. సందర్భంగా వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ రుద్విశ్రీ కు భగవంతుడు ఆయురారోగ్యాలు, మంచి చదువు రావాలని, అష్టైశ్వర్యాలు ప్రసాధించాలని కోరుతూ, చిన్నారిను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలూరు నియోజకవర్గం టిడిపి నాయకులు, కార్యకర్తలు, వైకుంఠం అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర కాంగ్రెస్ నాయకులు

- కూలీల నోటి కాడ కూడు తీసే నల్ల చట్టం వస్తుంది తస్మాత్ జాగ్రత్త.
- 2025 లో బిజెపి తెచ్చిన కొత్త చట్టం ప్రకారము పని హక్కును కోల్పోతున్నాం
- రాష్ట్రాల పై పెను భారం మోపడం(60:40) వెనుక పథకానికి మంగళం పాడడమే
- ఎస్సి, ఎస్టీ, మహిళ ల యొక్క జీవన ప్రమాణం తగ్గించడమే
- లేబర్ కంపొనెంట్ తగ్గించి, మెటీరియల్ కంపొనెంట్ కు అవకాశం ఇస్తే కాంట్రాక్టర్ ల కు కొమ్ముకాయడమే
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకములో పని చేసే ఉద్యోగుల పరిస్థితి అగమ్య గోచరం



మన గళం : డోన్ పేదోడి కడుపు మీద మోడీ ప్రభుత్వం దెబ్బ కొట్టి కరువు పని లేకుండా అనగా ఉపాధి హామీ పథకం లేకుండా చేయడానికి కుట్ర జరుగుతుందని నంద్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి మద్దులేటీ స్వామి అన్నారు. ఈ రోజు నంద్యాల పార్లమెంట్ డోన్ నియోజకవర్గం లో పార్టీ కార్యాలయములో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశములో వారుమాట్లాడుతూ.

ఇటీవల వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ) (వి బి –జి రాం జి) యాక్ట్ అనే నూతన పథకం పేదలకు పని హక్కును కాల రాసే విదంగా ఉందని, ఇన్నాళ్లు పేదోడి కడుపు నింపిన మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ యాక్ట్( ఎమ్ జి ఎన్ ఆర్ ఈ జి ఎస్)ను కనుమరుగు చేసే పన్నాగాలు కేంద్రములో బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నాగాం చేస్తుందని వారు మండి పడ్డారు.

నూతనపథకం ప్రకారం

ఉపాధిహామీకరువుపనులుచూపించండి అని పేదలు అడిగే హక్కు కోల్పోతామని,

ఎప్పుడు, ఎక్కడ పనులు చేయాలో ఢిల్లీ లో ఉన్న పెద్దలు చెప్పిన కాంట్రాక్టర్ ల చేతిలో ఉంటుంది,మన చేతుల్లో ఉండదని,ఇన్నాళ్లు కరువు పనికి ప్రతి 100లో 90 రూపాయలు ఇచ్చే కేంద్ర ప్రభుత్వం, ఇక మీదట 60 రూపాయలే ఇస్తాము, మిగతాది మీ రాష్ట్రల వాళ్ళే భరించాలని ముఖం మీద చెప్పడం దీని ద్వారా మన మీదే ఆ భారం ఉంటుంది. అప్పుల్లో ఉన్న రాష్ట్రాలు, అస్సలు బడ్జెట్ లేని రాష్ట్రాల్లో ఇక కరువు పనులు జరిగే అవకాశం ఉండదు.కరువు పనుల్లో ఏమి పనులు చేయాలో మనం స్థానిక గ్రామ సభలు మరియు పంచాయతీలలో తీర్మానం చేసేవాళ్ళం. ఇప్పుడు సెంట్రల్ ప్లానింగ్ మరియు కాంట్రాక్టర్లకు అధికారం ఇస్తారని

వ్యవసాయ సీజన్లలో 60–రోజుల బ్లాక్‌ఔట్ పీరియడ్ తెచ్చారు అంటే పని సీజన్ లో 2 నెలలు కరువు పనులు ఉండవు అని అంటున్నారు.అంటే వ్యవసాయ కూలీల ముఠాలు వాళ్ళ కూలీల రేట్లు పెంచవద్దని అడగవద్దని చెప్పకనే చెబుతున్నారు.అంతే కాకుండా ఈ పథకములో పని చేసే ఉద్యోగుల పరిస్థితి అగమ్య గొచరం అని, వీరికి ఎటువంటి ఉద్యోగ భద్రత లేదని, ఇంతవరకు దాదాపుగా 6నెలల జీతాలు చెల్లించలేని స్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉందని వారు అన్నారు.

కొత్త స్కీం లు తెండి కానీ అది ఆదుకొనే విధంగా ఉండాలి కానీ అవమానించే విధంగా, హక్కులను కాలరాసే విధంగా ఉండకూడదు.కూలీల నోటి కాడ కూడు తీసే నల్ల చట్టం వస్తుంది. తస్మాత్ జాగ్రత్త.

భారతదేశంలోని అన్ని రంగాలలో గల మేధావులు పేదవాడి నోటికాడ అన్నం ముద్దను లాగే ఈ ప్రయత్నాన్ని ఖండించాలని, వి బి –జి రాం జి పథకాన్ని వెనుకకు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో నంద్యాల డిసిసి ఉపాధ్యక్షులు యు. జనార్దన్, డిసిసి ప్రధాన కార్యదర్శి వడ్డే రాజశేఖర్, డిసిసి కార్యదర్శి ఆర్.గోపినాథ రావ్,మధు సూదన్ రెడ్డి,డోన్ మండల అధ్యక్షులు పఠాన్ హుస్సేన్, నాయకులు నాగన్న, గిడ్డయ్య, మహిళా నాయకురాలు లక్ష్మి దేవి,నాగమద్ది తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..




న్యూఢిల్లీ -- 10 జనవరి 2026 -- మన గళం : ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న లక్షలాది ఉద్యోగులకు శుభవార్త వినిపిస్తోంది. పీఎఫ్ కటింగ్‌కు వర్తించే వేతన పరిమితిని పెంచే అంశం తుది దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమలులో ఉన్న 15000 రూపాయల వేతన పరిమితి పాతదిగా మారిందని, దీన్ని సవరించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం మరియు ఈపీఎఫ్‌వో స్పష్టమైన నిర్ణయం తీసుకునేందుకు నాలుగు నెలల గడువు ఇచ్చింది.

పీఎఫ్ నిబంధనల ప్రకారం ప్రస్తుతం నెలవారీ జీతం 15000 రూపాయల వరకు ఉన్న ఉద్యోగులకే తప్పనిసరిగా పీఎఫ్ వర్తిస్తోంది. ఈ పరిమితి కారణంగా దీనికంటే ఎక్కువ వేతనం పొందుతున్న అనేక మంది ఉద్యోగులు పీఎఫ్ ప్రయోజనాలకు దూరమవుతున్నారు. ముఖ్యంగా నగరాల్లో జీవన వ్యయం పెరిగిన నేపథ్యంలో ప్రారంభ జీతాలే 18000 నుంచి 25000 రూపాయల వరకు ఉండటంతో, సామాజిక భద్రత పరిధికి బయట ఉన్న వారి సంఖ్య పెరుగుతోంది.

ఈ నేపథ్యంలో పీఎఫ్ వేతన పరిమితిని పెంచాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు, ఈ వ్యవస్థను పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. ద్రవ్యోల్బణం, జీవన వ్యయం, ఉద్యోగ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించాలని ఆదేశించింది. కోర్టు ఇచ్చిన గడువు పూర్తయ్యేలోపు స్పష్టమైన నిర్ణయం వెలువడే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

కార్మిక సంఘాలు పీఎఫ్ వేతన పరిమితిని కనీసం 30000 రూపాయలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. అలా చేస్తే ఎక్కువ మంది ఉద్యోగులు పీఎఫ్ పరిధిలోకి వచ్చి, పదవీ విరమణ తర్వాత భద్రమైన ఆర్థిక భవిష్యత్తును పొందగలుగుతారని వారు చెబుతున్నారు. పీఎఫ్ పథకం 1952లో ప్రారంభమైనప్పుడు వేతన పరిమితి కేవలం 300 రూపాయలుగా ఉండగా, కాలక్రమంలో అది పెరుగుతూ 2014లో చివరిసారిగా 15000 రూపాయలకు చేరింది. అప్పటి నుంచి పదకొండు సంవత్సరాలుగా ఎలాంటి మార్పు జరగలేదు.

ఇప్పుడు పరిమితి పెరిగితే ప్రైవేట్ రంగ ఉద్యోగులకు దీర్ఘకాలిక పొదుపు అవకాశాలు మెరుగవుతాయి. అలాగే ఉద్యోగ విరమణ తర్వాత వచ్చే ఆదాయం పెరిగి, కుటుంబ భద్రతకు ఇది పెద్ద ఊరటగా మారుతుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై దేశవ్యాప్తంగా ఉద్యోగులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## దేశంలోనే అతిపెద్ద ప్రాథమిక షేర్ విక్రయంగా రిలయన్స్ జియో రానుందా?

న్యూఢిల్లీ -- 10 జనవరి 2026 -- మన గళం : భారత షేర్ మార్కెట్ చరిత్రలో ఇప్పటివరకు లేని స్థాయిలో భారీ ప్రాథమిక షేర్ విక్రయం త్వరలో రానున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. రిలయన్స్ గ్రూప్‌కు చెందిన జియో ప్లాట్‌ఫాంలను 2026 సంవత్సరం తొలి అర్ధభాగంలో ప్రజల ముందుకు తీసుకురావాలని సంస్థ యోచిస్తున్నట్లు సమాచారం. ఈ వార్తతో దేశవ్యాప్తంగా పెట్టుబడిదారుల్లో భారీ ఆసక్తి నెలకొంది.

గత సంవత్సరం రిలయన్స్ చైర్మన్ ముకేష్ అంబానీ జియోను షేర్ మార్కెట్‌లో లిస్ట్ చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఆ ప్రకటన తర్వాత నుంచే జియో ప్రాథమిక షేర్ విక్రయంపై అంచనాలు గణనీయంగా పెరిగాయి. దేశీయంగా అతిపెద్ద టెలికాం సంస్థగా ఎదిగిన జియో ఈ ప్రక్రియ ద్వారా కొత్త రికార్డులు సృష్టించనుందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఈ ప్రాథమిక షేర్ విక్రయం ద్వారా జియో విలువ మరింత పెరుగుతుందని, దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు ఇది కీలక అవకాశంగా మారవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. దేశీయంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ పెట్టుబడిదారులు ఈ షేర్ విక్రయం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు సమాచారం.

## ఇది కదా మైండ్ బోయింగ్ ఆఫర్ అంటే..




హైదరాబాద్ -- 10 జనవరి 2026 -- మన గళం : దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. పెట్రోల్ వాహనాలతో పోలిస్తే తక్కువ నిర్వహణ ఖర్చులు, ఇంధన పొదుపు కారణంగా వినియోగదారులు ఎలక్ట్రిక్ కార్ల వైపు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారుల నమ్మకాన్ని మరింత పెంచేందుకు ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ టాటా మోటార్స్ సంచలన ఆఫర్‌కు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ఎలక్ట్రిక్ కారులో బ్యాటరీ ఖర్చే మొత్తం ధరలో దాదాపు 60 శాతం వరకు ఉంటుంది. సాధారణంగా బ్యాటరీలు 8 నుంచి 10 సంవత్సరాలు లేదా సుమారు 2 లక్షల కిలోమీటర్ల వరకు పనిచేస్తాయి. ఆ తర్వాత పనితీరు తగ్గే అవకాశం ఉంటుంది. ఈ భయాన్ని తొలగించేలా టాటా మోటార్స్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

రూ. 8 లక్షల ధర శ్రేణిలో లభించే టాటా నెక్సాన్ ఎలక్ట్రిక్ మోడళ్లకు జీవితకాల బ్యాటరీ వారంటీ ఇవ్వాలని కంపెనీ యోచిస్తోంది. జీవితకాల వారంటీ అంటే దేశీయ నిబంధనల ప్రకారం మొదటి యజమానికి 15 సంవత్సరాల వరకు అపరిమిత కిలోమీటర్ల కవరేజీ కల్పించడంగా భావిస్తున్నారు. దీని వల్ల భవిష్యత్తులో బ్యాటరీ మార్పు ఖర్చు గురించి వినియోగదారులకు ఎలాంటి ఆందోళన ఉండదని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి.

టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహన విభాగం 2025--26 ఆర్థిక సంవత్సరంలో మంచి వృద్ధిని నమోదు చేసింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు జరిగిన మూడో త్రైమాసికంలో 1,71,013 వాహనాలను విక్రయించి, గత ఏడాదితో పోలిస్తే 22 శాతం వృద్ధిని సాధించింది. ఎలక్ట్రిక్ వాహనాలపై పెరుగుతున్న ఆసక్తే ఈ వృద్ధికి ప్రధాన కారణమని విశ్లేషకులు అంటున్నారు.

ఈ జీవితకాల బ్యాటరీ ఆఫర్ అధికారికంగా ప్రకటిస్తే, దేశీయ ఎలక్ట్రిక్ కార్ల మార్కెట్‌లో ఇది గేమ్ ఛేంజర్‌గా మారే అవకాశముందని ఆటో రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వినియోగదారుల దృష్టిలో ఎలక్ట్రిక్ కార్లపై ఉన్న అనుమానాలకు ఇది పూర్తి స్థాయిలో చెక్ పెట్టే నిర్ణయంగా భావిస్తున్నారు.

## 2026లో రాగి బంగారం అవుతుంది..




న్యూఢిల్లీ -- జనవరి 10, 2026 -- మన గళం : 2025 సంవత్సరంలో రాగి పెట్టుబడిదారులకు అద్భుతమైన లాభాలను అందించింది. గత ఏడాది మొత్తం మీద రాగి ధరలు దాదాపు 60 శాతం వరకు పెరిగినట్లు మార్కెట్ గణాంకాలు చెబుతున్నాయి. 2026 నాటికి రాగి విలువ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అందుకే ఇప్పుడు పెట్టుబడిదారులు రాగిని కొత్త బంగారంగా చూస్తున్నారు.

విద్యుత్ వాహనాల తయారీ, డేటా కేంద్రాల విస్తరణ, విద్యుత్ కేబుల్స్ అవసరం పెరగడం వంటి కారణాలతో రాగికి డిమాండ్ భారీగా పెరిగింది. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా రాగి ఉత్పత్తి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సరఫరా కొరత ఏర్పడుతోంది. అంతర్జాతీయ అంచనాల ప్రకారం 2026 నాటికి ప్రపంచ మార్కెట్లో సుమారు 150000 టన్నుల రాగి లోటు ఏర్పడే అవకాశం ఉంది. ఈ పరిస్థితి రాగి ధరలను మరింత పైకి నెట్టే సూచనలు ఇస్తోంది. భారతదేశంలో రాగిలో పెట్టుబడి పెట్టడం బంగారం లేదా వెండి లాగే సులభం కాదు. రాగికి సంబంధించి ఎటువంటి పథకాలు లేదా ఫండ్లు ఇప్పటివరకు అందుబాటులోకి రాలేదు. అలాగే సాధారణ ప్రజలు నేరుగా రాగి బిస్కెట్లు లేదా నాణేలు కొనుగోలు చేసే అవకాశం కూడా లేదు. ప్రస్తుతం రిటైల్ పెట్టుబడిదారులకు ఉన్న ప్రధాన మార్గం కమోడిటీ మార్కెట్‌లో జరిగే ఫ్యూచర్స్ ట్రేడింగ్ మాత్రమే. అయితే ఈ విధానం చిన్న పెట్టుబడిదారులకు ప్రమాదకరమైనదిగా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక్క ట్రేడుకు భారీ మొత్తంలో మార్జిన్ డబ్బు అవసరం అవుతుంది. మార్కెట్ లో చిన్న మార్పు వచ్చినా నష్టాలు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే రాగిలో పెట్టుబడి పెట్టే ముందు మార్కెట్‌పై లోతైన అవగాహన, రిస్క్ నియంత్రణ పద్ధతులు తప్పనిసరిగా తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తంగా చూస్తే రాగి భవిష్యత్తులో భారీ లాభాల అవకాశాలు ఉన్న రంగంగా మారుతోంది. కానీ ఇది ప్రతి పెట్టుబడిదారికి సరిపడే మార్గం కాదని, అనుభవం ఉన్నవారే జాగ్రత్తగా అడుగులు వేయాలని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# 'రాజా సాబ్' బాక్సాఫీస్ జాతర..




హైదరాబాద్ -- 10 జనవరి 2026 -- మన గళం :
రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, మారుతి దర్శకత్వంలో రూపొందిన హారర్ కామెడీ చిత్రం 'ది రాజా సాబ్' బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా తొలి రోజే కలెక్షన్ల సునామీని నమోదు చేసింది. తొలి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ. 112 కోట్ల వసూళ్లను సాధించినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.

ఈ చిత్రంతో ప్రభాస్ ఖాతాలో మరో భారీ ఓపెనర్ చేరింది. బాహుబలి 2, సాహో, ఆదిపురుష్, సలార్, కల్కి చిత్రాల తర్వాత రూ. 100 కోట్లకు పైగా ఓపెనింగ్ సాధించిన ఆరో చిత్రంగా 'రాజా సాబ్' నిలిచింది. ఈ ఘనత సాధించిన ఏకైక భారతీయ హీరోగా ప్రభాస్ మరోసారి రికార్డు సృష్టించారు.

వసూళ్ల వివరాల ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రం రూ. 58 కోట్ల వసూళ్లు సాధించింది. కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాల్లో రూ. 18 కోట్లు, ఓవర్సీస్ మార్కెట్లలో రూ. 36 కోట్ల వసూళ్లు నమోదు చేసింది.

మారుతి మార్క్ వినోదం, ప్రభాస్ క్రేజ్ కలసి ప్రేక్షకులను థియేటర్లకు భారీగా రప్పిస్తున్నాయి. తొలి రోజే ఈ స్థాయిలో వసూళ్లు రావడంతో రాబోయే రోజుల్లో బాక్సాఫీస్ వద్ద 'రాజా సాబ్' జోరు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఓటీటీలోకి శివాజీ 'దండోరా'.. స్ట్రీమింగ్ ఎక్కడంటే!




హైదరాబాద్ -- 10-01-2026 -- మన గళం : తెలంగాణ పల్లెటూరి నేపథ్యం, కుల వివక్ష వంటి సున్నితమైన సామాజిక అంశంతో తెరకెక్కిన దండోరా చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ప్రచార కార్యక్రమాలతో పాటు నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. థియేటర్లలో మంచి స్పందన పొందిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ వేదికపైకి రానుంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో జనవరి 14 నుంచి ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు కీలక పాత్రల్లో నటించగా మురళీకాంత్ దర్శకత్వం వహించారు. కథ విషయానికి వస్తే తెలంగాణలోని తుళ్లూరు గ్రామం చుట్టూ కథ సాగుతుంది. ఆ గ్రామంలో కుల వివక్ష బలంగా పాతుకుపోయి ఉంటుంది. తక్కువ కులానికి చెందినవారి అంత్యక్రియలు ఊరికి దూరంగా చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ క్రమంలో అగ్రకులానికి చెందిన రైతు శివాజీ అకస్మాత్తుగా మరణిస్తాడు. అయితే అతని శవాన్ని అగ్రకుల స్మశాన వాటికలో దహనం చేయడానికి కుల పెద్దలు అడ్డుతగులుతారు. తన తండ్రికి గౌరవప్రదమైన అంత్యక్రియలు చేయాలనే లక్ష్యంతో కొడుకు విష్ణు, కూతురు సుజాత, ఊరి సర్పంచ్ కలిసి పోరాటం మొదలుపెడతారు. ఈ కుల రాజకీయాల వెనుక ఉన్న కారణాలు, రవి హత్యతో ఉన్న సంబంధం, శివాజీ జీవితాన్ని మార్చిన సంఘటనలు కథను ఆసక్తికరంగా ముందుకు నడిపిస్తాయి.

# మలయాళ రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు సిగ్గుపడిన శ్రీలీల

హైదరాబాద్ -- 10 జనవరి 2026 -- మన గళం : టాలీవుడ్ సంచలనం శ్రీలీల ప్రస్తుతం తన కోలీవుడ్ తొలి చిత్రం పరాశక్తి ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. సుధా కొంగర దర్శకత్వంలో శివకార్తికేయన్ సరసన నటించిన ఈ చిత్రం తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా ప్రచారం కోసం శ్రీలీల కేరళలోని కొచ్చి నగరానికి వెళ్లగా అక్కడ జరిగిన పత్రికా సమావేశంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది.

పత్రికా సమావేశంలో ఒక మలయాళ రిపోర్టర్ సరదాగా మాట్లాడుతూ ముందుగా మీకు తమిళం వచ్చా అని ప్రశ్నించగా శ్రీలీల అవునని సమాధానం ఇచ్చింది. అనంతరం ఆమె అందాన్ని పొగడ్తలతో ప్రశంసిస్తూ మిమ్మల్ని ప్రత్యక్షంగా చూడడం ఇదే తొలిసారి, మీరు చాలా అందంగా ఉన్నారని చెప్పడంతో శ్రీలీల సిగ్గుపడుతూ నవ్వింది. అయితే వెంటనే అదే రిపోర్టర్ మీరు నాకు సోదరి లాగా అనిపిస్తున్నారు అని చెప్పడంతో అక్కడ వాతావరణం మరింత సరదాగా మారింది.

దానికి శ్రీలీల తనదైన చమత్కార శైలిలో స్పందిస్తూ తాను వైద్య విద్యార్థిని అని గుర్తు చేస్తూ నేను వైద్యురాలిని కానీ నర్సు కాను అని సరదాగా సమాధానం ఇచ్చింది. ఆమె ఇచ్చిన ఈ హాస్యప్రదమైన స్పందనతో సమావేశం అంతా నవ్వులతో మార్మోగింది. ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యాలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి.



# తెలంగాణలో 'మన శంకరవరప్రసాద్ గారు' టికెట్ రేట్ల పెంపు.. జీవో జారీ!

హైదరాబాద్ -- 10 జనవరి 2026 -- మన గళం : టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సంక్రాంతి సందడి మొదలైన విషయం తెలిసిందే. ఇప్పటికే థియేటర్లలో భారీ చిత్రాలు సందడి చేస్తుండగా, మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో, విజయవంతమైన దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రం జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్‌కు తెలంగాణ ప్రభుత్వం కీలక అనుమతులు ఇచ్చింది. ఈ సినిమాకు టికెట్ ధరలు పెంచుకునేందుకు ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ప్రత్యేక ప్రీమియర్ షోలకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జనవరి 11న ప్రత్యేక ప్రీమియర్ షోలకు అనుమతి లభించింది. ఈ షోల టికెట్ ధరను 600 రూపాయలుగా నిర్ణయించారు. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య ఈ ప్రీమియర్ షోలను ప్రదర్శించాల్సి ఉంటుంది. అలాగే జనవరి 12 నుంచి వారం రోజుల పాటు సాధారణ థియేటర్లలో 50 రూపాయలు, మల్టీ స్క్రీన్ థియేటర్లలో 100 రూపాయలు అదనంగా టికెట్ ధర పెంచుకునే వెసులుబాటు కల్పించారు. ఇదివరకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఈ సినిమాకు టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే.

ఈ చిత్రంలో చిరంజీవి సరసన నయనతార కథనాయికగా నటించగా, విక్టరీ వెంకటేష్ ఒక కీలక పాత్రలో కనిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. సంక్రాంతి కానుకగా విడుదల కానున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



# కోచ్ జెలెజ్నీతో విడిపోయిన నీరజ్ చోప్రా..



న్యూఢిల్లీ -- 10 జనవరి 2026 -- మన గళం : భారత స్టార్ జావెలిన్ త్రోయర్, ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా తన కోచ్ జాన్ జెలెజ్నీతో కోచింగ్ భాగస్వామ్యాన్ని ముగించుకున్నాడు. ఈ నిర్ణయం ఇద్దరి పరస్పర అంగీకారంతో తీసుకున్నదని సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. తమ మధ్య నమ్మకం, గౌరవం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

జెలెజ్నీ శిక్షణలోనే నీరజ్ తొలిసారిగా 90 మీటర్ల మార్క్‌ను దాటిన సంగతి గుర్తు చేశారు. ఈ ప్రయాణం తనకు ఎంతో అర్థవంతమైందని నీరజ్ తెలిపాడు. చిన్ననాటి హీరో అయిన జెలెజ్నీ వద్ద శిక్షణ పొందడం ప్రత్యేక అనుభవమని, టెక్నిక్, రిథమ్, కదలికలపై ఆయన ఆలోచన విధానం నుంచి చాలా నేర్చుకున్నానని పేర్కొన్నాడు.

జెలెజ్నీ కూడా ఈ భాగస్వామ్యంపై సంతృప్తి వ్యక్తం చేశాడు. నీరజ్ లాంటి అథ్లెట్‌తో పని చేయడం గొప్ప అనుభవమని, అతను 90 మీటర్ల మార్క్‌ను దాటడంలో తాను సహాయపడగలిగినందుకు ఆనందంగా ఉందని తెలిపాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు 12 రోజుల ముందు వెన్నునొప్పి రావడం అతని అవకాశాలను ప్రభావితం చేసిందని పేర్కొన్నాడు.

ఇకపై తన శిక్షణ బాధ్యతలను తానే చూసుకోవాలని నీరజ్ నిర్ణయించుకున్నాడు. ఇప్పటివరకు పని చేసిన ఉత్తమ కోచ్‌ల నుంచి నేర్చుకున్న పాఠాలను ఆచరణలో పెట్టనున్నట్లు వెల్లడించాడు. 2026 సీజన్‌పై ఆశాభావం వ్యక్తం చేస్తూ, 2027 ప్రపంచ ఛాంపియన్‌షిప్, 2028 ఒలింపిక్స్ తన ముందున్న ప్రధాన లక్ష్యాలని నీరజ్ స్పష్టం చేశాడు.

# కెమెరామెన్‌పై స్మృతి మందాన అసహనం..



ముంబై -- 10 జనవరి 2026 -- మన గళం :భారత మహిళా క్రికెట్ జట్టు స్టార్ ఆటగాడు, బెంగళూరు జట్టు కెప్టెన్ స్మృతి మందాన మరోసారి వార్తల్లో నిలిచింది. మహిళల ప్రీమియర్ లీగ్‌లో భాగంగా ముంబై జట్టు, బెంగళూరు జట్టు మధ్య జరిగిన తొలి మ్యాచ్‌కు ముందు ఈ ఘటన చోటుచేసుకుంది. మ్యాచ్‌కు ముందు మైదానంలో బ్యాట్‌తో సాధన చేస్తున్న సమయంలో ఒక కెమెరామెన్ స్మృతి మందానకు చాలా దగ్గరగా వచ్చి చిత్రీకరణ చేయడానికి ప్రయత్నించాడు.

దీంతో స్మృతి మందాన కాస్త అసహనం వ్యక్తం చేస్తూ అక్కడ కూడా వదలరా అన్నట్లుగా స్పందించింది. ఆమె ఇచ్చిన ఈ రియాక్షన్‌ను బెంగళూరు జట్టు తమ సామాజిక మాధ్యమాల్లో పంచుకోగా, అది క్షణాల్లో వైరల్‌గా మారింది. అభిమానులు స్మృతి సహజ స్పందన అంటూ మద్దతు తెలుపుతున్నారు. స్మృతి మందాన ఆటతో పాటు వ్యక్తిత్వంతో కూడా పెద్ద సంఖ్యలో అభిమానులను సంపాదించుకుంది. ఆమెపై అభిమానులు చూపించే ఆసక్తి కారణంగానే మైదానంలోనూ, మైదానం వెలుపలనూ కెమెరాల ఫోకస్ ఎక్కువగా ఉంటుందని క్రీడా వర్గాలు చెబుతున్నాయి. అయితే సాధన సమయంలో వ్యక్తిగత స్పేస్ ఇవ్వాలన్న అభిప్రాయం కూడా పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఇక మహిళల ప్రీమియర్ లీగ్ తాజా సీజన్‌లో తొలి మ్యాచ్‌లో బెంగళూరు జట్టు విజయం సాధించి శుభారంభం చేసింది. డిఫెండింగ్ చాంపియన్ ముంబై జట్టుపై కీలక పోరులో విజయం సాధించడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది.

# టీ20 ప్రపంచకప్ జట్టులో చోటు దక్కకపోవడంపై శుభ్‌మన్ గిల్ స్పందన



ముంబై -- 10-01-2026 -- మన గళం : భారత క్రికెట్ జట్టు వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ త్వరలో జరగనున్న 2026 టీ20 ప్రపంచకప్ జట్టులో తనకు స్థానం దక్కకపోవడంపై తొలిసారి స్పందించాడు. న్యూజిలాండ్‌తో జరిగే తొలి వన్డే మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన గిల్, సెలక్టర్ల నిర్ణయాన్ని తాను పూర్తిగా గౌరవిస్తున్నట్లు వెల్లడించాడు.

ఇటీవల కాలంలో పొట్టి ఫార్మాట్‌లో తన ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్లే జట్టులో చోటు దక్కలేదని గిల్ పరోక్షంగా అంగీకరించాడు. జట్టు సమతుల్యత, అవసరాలను దృష్టిలో పెట్టుకుని సెలక్షన్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నాడు. టీ20 జట్టులో కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ కొనసాగుతుండగా, వైస్ కెప్టెన్ బాధ్యతలను తన స్థానంలో ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌కు అప్పగించిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించాడు.

ఈ సందర్భంగా గిల్ మాట్లాడుతూ, జట్టులో ఎంపిక కావడం లేదా కాకపోవడం మన చేతుల్లో ఉండదని, తలరాతలో ఉన్నదే జరుగుతుందని వ్యాఖ్యానించాడు. దేశం కోసం ఆడే ప్రతి ఆటగాడు తన వంతు కృషి చేస్తాడని, తాను కూడా భవిష్యత్తులో అవకాశాలు వచ్చినప్పుడు అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి సిద్ధంగా ఉంటానని స్పష్టం చేశాడు. ప్రస్తుతం టీ20 ప్రపంచకప్‌కు ఎంపికైన భారత జట్టుకు శుభాకాంక్షలు తెలిపిన గిల్, దేశం కోసం వారు గొప్ప విజయాన్ని సాధించాలని ఆకాంక్షించాడు.

# కివీస్‌తో తొలి వన్డే.. గంభీర్ కన్నింగ్ ప్లాన్..



ముంబై -- 10 జనవరి 2026 -- మన గళం :
కొత్త సంవత్సరం ఆరంభంలో టీమిండియా మరో కీలక వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. దక్షిణాఫ్రికాతో సిరీస్ ముగిసిన వెంటనే స్వదేశంలో న్యూజిలాండ్‌తో వన్డే పోరుకు భారత జట్టు రంగం సిద్ధం చేసుకుంది. ఈ సిరీస్‌లో తొలి వన్డే రేపు వడోదర క్రికెట్ మైదానంలో జరగనుంది. ఈ మ్యాచ్‌కు సంబంధించిన ప్లేయింగ్ ఎలెవన్‌పై ఇప్పటికే స్పష్టత వచ్చింది. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ బరిలోకి దిగడం ఖరారైంది. ఓపెనింగ్‌లో రోహిత్ శర్మతో పాటు శుభ్‌మాన్ గిల్ ఇన్నింగ్స్ ప్రారంభించనున్నారు. వన్‌డౌన్ స్థానంలో విరాట్ కోహ్లీ ఆడనున్నాడు. నాలుగో స్థానంలో శ్రేయాస్ అయ్యర్ తిరిగి జట్టులోకి వస్తున్నాడు. ఇటీవల విజయ్ హజారే ట్రోఫీలో అర్ధశతకంతో ఫామ్‌లోకి వచ్చిన అయ్యర్‌కు మళ్లీ అవకాశం కల్పించారు.

వికెట్ కీపర్ బాధ్యతలను కేఎల్ రాహుల్ నిర్వహించనున్నాడు. ఐదో స్థానంలో బ్యాటింగ్ చేయనున్న రాహుల్ కారణంగా రిషబ్ పంత్ బెంచ్‌కే పరిమితం కానున్నాడు. ఆల్‌రౌండర్‌గా రవీంద్ర జడేజా ఆరో స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు. ఏడో స్థానానికి వాషింగ్టన్ సుందర్‌కు ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి. అతడి ప్రస్తుత ఫామ్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టులో చోటు ఖాయం అయినట్లు తెలుస్తోంది.

బౌలింగ్ విభాగంలో మహమ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ వేగ బౌలింగ్ బాధ్యతలు చేపడతారు. స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్‌తో పాటు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ కీలక పాత్ర పోషించనున్నారు. గంభీర్ రూపొందించిన ఈ ప్లాన్‌తో తొలి వన్డేలో కివీస్‌పై పైచేయి సాధించాలని టీమిండియా భావిస్తోంది.

# రోహిత్ శర్మ నాకు ఎప్పటికీ కెప్టెనే: జై షా



ముంబై -- 10-01-2026 -- మన గళం : భారత క్రికెట్‌లో రోహిత్ శర్మ స్థానం ఎప్పటికీ ప్రత్యేకమేనని అంతర్జాతీయ క్రికెట్ మండలి ఛైర్మన్ జై షా స్పష్టం చేశారు. ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రోహిత్ శర్మ తనకు ఎప్పటికీ కెప్టెన్‌గానే ఉంటాడని అన్నారు. భారత జట్టుకు నాయకత్వం వహించి రెండు అంతర్జాతీయ క్రికెట్ ట్రోఫీలను అందించాడని జై షా కొనియాడారు.

రోహిత్ నాయకత్వంలో 2024లో జరిగిన ప్రపంచ స్థాయి పొట్టి ఫార్మాట్ టోర్నమెంట్, 2025లో జరిగిన చాంపియన్స్ టోర్నమెంట్‌లలో భారత్ విజయం సాధించిందని గుర్తు చేశారు. ఈ విజయాలు భారత క్రికెట్ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచాయని అన్నారు. తన మాటలు విన్న వెంటనే రోహిత్ శర్మ ఆనందంతో నవ్వగా, ఆయన భార్య రితిక కూడా భావోద్వేగానికి లోనయ్యారని అక్కడున్నవారు తెలిపారు.

2023లో జరిగిన ప్రపంచ కప్‌లో భారత జట్టు వరుసగా 10 మ్యాచ్‌లు గెలిచి అభిమానుల మనసులు గెలిచిందని, కానీ ట్రోఫీ మాత్రం దక్కలేదని జై షా గుర్తుచేశారు. అయితే 2024లో రాజ్‌కోట్‌లో తాను చెప్పిన మాటలు నిజమయ్యాయని, ఈసారి హృదయాలతో పాటు కప్‌ను కూడా గెలిచామని గర్వంగా తెలిపారు.

ప్రస్తుతం రోహిత్ శర్మ పొట్టి ఫార్మాట్, దీర్ఘ ఫార్మాట్ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పి, ఒక్కరోజు మ్యాచ్‌లలో మాత్రమే భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అయినప్పటికీ నాయకుడిగా ఆయన ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని జై షా వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

# కేవలం మ్యాచులు ఆడటం మాత్రమే మా పని..



ఢాకా -- 10-01-2026 -- మన గళం :బంగ్లాదేశ్--భారత్ మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ బంగ్లా క్రికెటర్ మహేదీ హసన్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ నుంచి తప్పించిన తర్వాత ఇరు దేశాల మధ్య వివాదం మరింత ముదిరిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ పాల్గొనడంపై అనిశ్చితి నెలకొంది. వేదికలు మార్చాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కోరడం, దీనిపై రోజుకో అంశం వెలుగులోకి రావడం చర్చకు దారి తీస్తోంది. ఈ పరిస్థితులపై స్పందించిన మహేదీ హసన్ మాట్లాడుతూ, వివాదాల గురించి ఆటగాళ్లు ఆలోచించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశాడు. ఈ అంశాలన్నీ జట్టు మేనేజ్‌మెంట్, అధికారులు చూసుకుంటారని, క్రికెటర్ల పని కేవలం మ్యాచ్‌లు ఆడటమేనని వ్యాఖ్యానించాడు. అవసరమైతే ఆటగాళ్లను ఎక్కడికి పంపినా వెళ్లి ఆడాల్సిందేనని, ఈ విషయంలో ఇతర ఆటగాళ్లకు సందేహాలు ఉండవని తాను భావిస్తున్నానని చెప్పాడు. ఇదిలా ఉండగా, గత టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్‌కు నాయకత్వం వహించిన నజ్ముల్ హుస్సేన్ శాంటో కూడా ప్రస్తుత పరిస్థితులపై స్పందించాడు. ప్రతి ప్రపంచకప్‌కు ముందు ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయని, ఇవి ఆటగాళ్ల ప్రదర్శనపై ప్రభావం చూపుతాయని అన్నాడు.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP. Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.